క్లుప్తంగా

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): దసరా ఉత్సవాల్లో భాగంగా వెంకటేశ్వరపురంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని శాంతి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. అనంతరం శ్రీమన్నారాయణుని అలంకారంలో శ్రీవారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కొండల రావు, మాధవి వ్యవహరించారు.

బైరి రెడ్డయ్య సంస్మరణ సభ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెన్నెల కంటి రాఘవయ్య భవనంలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్టీఎఫ్) ఆధ్వర్యంలో ఎన్టీఎఫ్ రాష్ట్ర అదనపు కార్యదర్శి బైరి రెడ్డయ్య సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. రెడ్డయ్య చిత్రపటానికి ఎన్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీ చెంచయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లాలోని యానాదుల సంక్షేమానికి రెడ్డయ్య ఎనలేని కృషి చేశారని, ఆయన ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలన్నారు. నాయకులు దయాకర్, లోక్‌సాయి, చాముండి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు డీఏపై హర్షం

కావలి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దసరా కానుకగా డీఏ పెంచడంపై వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మునీర్ జాన్, జిల్లా అధ్యక్షుడు కేవీ నారాయణరాజు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు 3.64 శాతం డీఏ మంజూరు చేయాలని సీఎం ఆదేశాలు ఇవ్వడంపై ప్రభుత్వ ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని, ఇతర సమస్యలను పరిష్కరిస్తుందని మునీర్ జాన్, కేవీ నారాయణరాజు తెలిపారు.

టీజీపీ డిప్యూటీ కలెక్టర్ సువర్ణమ్మ బదిలీ

ఆత్మకూరు: ఆత్మకూరులోని తెలుగుగంగ ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్ జి.సువర్ణమ్మ వెలుగొండ స్పెషల్ కలెక్టర్ పీఏగా బదిలీ అయ్యారు. మూడేళ్లకుపైగా ఆత్మకూరు తెలుగుగంగ ప్రాజెక్ట్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను బదిలీ చేస్తూ ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆమె స్థానంలో రాపూరు టీజీపీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం రాజారమేష్ ప్రేమ్‌కుమార్‌ను బదిలీ చేశారు. మరో రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

వైభవంగా నరసాలమ్మ పొంగళ్లు

సంగం: మండలంలోని చెన్నవరప్పాడులో కొలువైన నరసాలమ్మ అమ్మవారి పొంగళ్లు గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు, గ్రామ పెద్దలు, ప్రజలు తప్పెట్లతో పొంగళ్లతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారిని పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగళ్లు పెట్టారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర

ఉదయగిరి: పట్టణంలో యాదవ సామాజిక వర్గీయులు ఆదివారం గంగమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా పొంగలి, సామగ్రిని ప్రత్యేక తట్టలో అలంకరించుకుని డప్పు వాయిద్యాలు, బాణసంచా సందడితో యాదవపాళెం నుంచి ఊరేగింపుగా ఆనకట్ట వరకు చేరుకుని గంగమ్మకు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు.

దీవించమ్మా.. దుర్గమ్మ

• కోలాహలంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

పొదలకూరు : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా తన్నీరు చినమస్తానయ్య, సుబ్రహ్మణ్యం బ్రదర్స్ వ్యవహరించారు. ఉదయం లలిత సహస్రనామార్చన, ఖడ్గమాల, త్రిశతి కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక పూజలకు భక్తులు హాజరయ్యారు.

విద్యాలక్ష్మిగా అమ్మవారి దర్శనం

పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు భక్తులకు విద్యాలక్ష్మిగా దర్శనం ఇచ్చారు. రజిత పుష్పాలు, మల్లెపూలతో అర్చన చేశారు.

ఆశ్రమంలో చండీయాగం

మండలంలోని ఇనుకుర్తిలో ఉన్న ఆదిపరాశక్తి శ్రీకాంతమ్మతల్లి ఆశ్రమంలో ఆదివారం అత్యంత వైభవంగా చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఏర్పాటు చేశారు.

కామాక్షితాయి ఆలయంలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : శరన్నవరాత్రుల సందర్భంగా జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారు ఆదివారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి వేద పండితులు దేవీసప్తశతి, దేవీ భాగవత పారాయణం జరిపించారు. సామూహిక కుంకుమార్చన వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

దుర్గాదేవి, మహిషాసురమర్ధినిగా రాజరాజేశ్వరి

మనుబోలు : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మనుబోలు మండల కేంద్రంలో ఆదివారం అమ్మవారు దుర్గాదేవి, మహిషాసురమర్ధిని అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయం వద్ద అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి దుర్గాదేవి అలంకారం చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అలాగే మనుబోలు దసరా చావడి వద్ద అర్చకుడు సుబ్రహ్మణ్యంశర్మ, కోదండరామపురంలో హరిశర్మ అమ్మవారిని మహిషాసురమర్ధిని, కన్యకాపరమేశ్వరిగా అలంకరించి మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా వావిలేటి మనోజ్‌కుమార్-సుమంజలి దంపతులు, దాసరి భాస్కర్‌గౌడ్ బ్రదర్స్, మల్లాబత్తిన వెంకురెడ్డి-సుజాతమ్మ దంపతులు వ్యవహరించారు.

మహిషాసురమర్ధినిగా అమ్మవారు

ఇందుకూరుపేట : దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం గంపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు ఆదివారం మహిషాసురమర్ధినిగా భక్తులను కటాక్షించారు. తొలుత అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఉభయదాతలుగా నరసాపురం గ్రామానికి చెందిన తాత సీతారావమ్మ జ్ఞాపకార్థం కుమారులు, కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

మైపాడులో..

తీరప్రాంత గ్రామమైన మైపాడులో కొలువైన శ్రీఅన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన, పల్లకి సేవ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉభయదాతలుగా విమలాకర్‌రెడ్డి వ్యవహరించారు.

కొత్తూరులో..

మండలంలోని కొత్తూరు గ్రామంలో ఉన్న లలితా మహేశ్వరి ఆశ్రమంలో పీఠాధిపతి రామాయణం మహేష్‌స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు, పల్లకి సేవ జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

పల్లిపాడులో..

మండలంలోని పల్లిపాడులో ఉన్న మీనాక్షి సమేత రామేశ్వర వేణుగోపాలస్వామి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి వేడుకల సందర్భంగా గ్రామాల్లో సందడి నెలకొంది.



పొదలకూరు : దుర్గాదేవిగా అమ్మవారు



పొదలకూరు : విద్యాలక్ష్మిగా అమ్మవారు



మనుబోలు : పోలేరమ్మ ఆలయంలో దుర్గాదేవి అలంకారం



మనుబోలు దసరా చావడి వద్ద మహిషాసురమర్ధిని అలంకారం



ఇందుకూరుపేట : ప్రత్యేకాలంకరణలో చాముండేశ్వరీదేవి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయంలో..

అమ్మవారి ఆశీస్సులతో మరోసారి అధికారంలోకి

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీదేవి ఆశీస్సులతో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శరన్నవరాత్రుల సందర్భంగా ఆర్యవైశ్య ప్రముఖుల ఆహ్వానం మేరకు పట్టణంలోని కన్యకాపరమేశ్వరీదేవి దేవస్థానానికి మంత్రి కాకాణి ఆదివారం రాత్రి విచ్చేశారు. తొలుత అర్చకులు, దేవస్థానం చైర్మన్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి మంత్రి కాకాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు పరమేశ్వరీదేవి అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజల సంతోషం కోసం తపించే వైఎస్ జగన్‌కు అమ్మవారి ఆశీస్సుల ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్లు తెలియజేశారు. మంత్రి కాకాణి వెంట దేవస్థానం చైర్మన్, కార్యదర్శి ఆదూరు వెంటకసుబ్బయ్య, రాచపూటి రామలింగయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, వార్డు సభ్యురాలు ఆకులూరు అనూరాధ, హేమంత్, కోనం చినబ్రహ్మయ్య, మారు వెంకటరామిరెడ్డి, భగవాన్ తదితరులు ఉన్నారు.



అమ్మవారికి నమస్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

మనుబోలు : మండల పరిధిలోని హైవేపై రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. ఐజేఎం అధికారులు ఆదివారం హైవే మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహనాలు నిలిచిపోవడంతో ఎస్సై తన సిబ్బందితో వెళ్లి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాలతో హైవేపై ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక వేగంతో డ్రైవ్ చేయడం చేస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా నిర్మాణ మరమ్మతులు చేపట్టాలని ఐజేఎం అధికారులకు సూచించారు.



ట్రాఫిక్ నియంత్రణలో ఎస్సై అజయ్‌కుమార్

రేపు నిత్యాన్నదాన భవనం ప్రారంభం

పొదలకూరు : మండలంలోని ఇనుకుర్తి గ్రామంలో ఆదిపరాశక్తి కాంతమ్మతల్లి ఆశ్రమంలో మంగళవారం విజయదశమి సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు నిత్యాన్నదాన భవనాన్ని ప్రారంభిస్తామని ఆశ్రమ కమిటీ శనివారం వెల్లడించింది. పులిమి వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం పులిమి నరేంద్ర-మోహనలత భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

గ్రామాల్లో దసరా కోలాహలం





విడవలూరు : మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామంలో దసరా కోలాహలం నెలకొంది. నవరాత్రుల సందర్భంగా గ్రామంలో కొలువైన పార్వతీదేవి అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు విభిన్న అలంకారాలు చేశారు. కాగా ఆదివారం పలువురు కళాకారులు వివిధ వేషధారణల్లో అలరించారు. నృత్య ప్రదర్శనలు చేసి ప్రజలను ఆకట్టుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న మంత్రి కాకాణి

మనుబోలు : మనుబోలు, వీరంపల్లి గ్రామాల్లో వేర్వేరు ప్రమాదాల్లో గాయపడి చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఇద్దరికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. మనుబోలు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మోచర్ల పుల్లయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా, ఈయనకు ఆర్థిక సాయంగా రూ.1.80 లక్షల చెక్కును కాకాణి అందజేశారు. అలాగే వీరంపల్లికి చెందిన గోనుపల్లి అంకయ్య తాడిచెట్టు పైనుంచి పడడంతో వెన్నుపూస దెబ్బతినింది. ఈయనకు కూడా రూ.80 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాకాణి అందజేశారు. వీటిని నెల్లూరులోని ఆయన కార్యాలయంలో అందజేశారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ నేతలు కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, జట్టి సురేందర్‌రెడ్డి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న టిప్పర్

• ముగ్గురికి స్వల్పగాయాలు

వెంకటాచలం : కారును వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీకొనడంతో ముగ్గురు గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం జరిగింది. నాయుడుపేట పట్టణానికి చెందిన రామ్మోహన్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో నెల్లూరు వెళ్తుండగా, వెనుక నుంచి కంకర లోడుతో వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న రామ్మోహన్‌తో పాటు ఇద్దరు మహిళలు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన కంకర లోడ్ టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ముమ్మరంగా పూడికతీత పనులు

ముత్తుకూరు : ముత్తుకూరు-వెంకటాచలం మధ్య ఉన్న మేజర్ డ్రెయిన్ నక్కలకాలువలో పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 5 రీచ్‌ల్లో ప్రస్తుతం 6 యంత్రాల ద్వారా పూడిక తీసే పనులను నిర్వహిస్తున్నారు. సుమారు రూ.4.30 కోట్ల అంచనాలతో పంట పొలాలకు ముంపు బెడద లేకుండా చేయాలన్న లక్ష్యంతో పనులు చేస్తున్నారు. నవంబర్‌లో తుపాన్లు, భారీ వర్షాలకు వరద పోటెత్తి పొలాలను ముంచెత్తకుండా పనులు వేగవంతం చేశారు. ప్రస్తుతం నిడిగుంటపాళెం, పోలంరాజుగుంట ప్రాంతాల్లో పూడిక తీసే పనుల్లో యంత్రాలు బిజీగా ఉన్నాయి.



నక్కలకాలువలో పూడిక తీస్తున్న యంత్రాలు

కొడవలూరు ఎస్సైగా వీరప్రతాప్

కొడవలూరు : కొడవలూరు ఎస్సైగా వీరప్రతాప్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బుచ్చిరెడ్డిపాళెం ఎస్సైగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సుబ్బారావు వీఆర్‌కు వెళ్లారు. కాగా వీరప్రతాప్‌ను నేతాజీ అభ్యుదయ సేవాసమితి అధ్యక్షుడు కోవూరు వెంకీ మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేశారు.

వెండి గంగాళం, చెంబు వితరణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలోని కామాక్షితాయి అమ్మవారికి మండలంలోని మినగల్లు గ్రామానికి చెందిన కాకుటూరు సుగుణమ్మ ఆదివారం వెండి గంగాళం వితరణగా అందజేశారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన జక్కా సుస్మిత అమ్మవారికి వెండి చెంబును అందజేశారు. వీటిని అమ్మవారి నిత్య అభిషేకానికి వినియోగించాలని దాతలు కోరారు.

విద్యుత్ అధికారుల పరుగులు

• మంత్రి ఆదేశాలతో స్తంభాల నిర్మాణం

పొదలకూరు : రెండు నెలలుగా వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభాల నిర్మాణం చేపట్టాలని మండలంలోని అల్లూర్తి గ్రామానికి చెందిన రైతులు డీడీ చెల్లించినా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జోక్యం చేసుకోవడంతో అధికారులు పరుగులు తీసి స్తంభాలను నిర్మించారు. వావింటపర్తి గ్రామ పర్యటనకు గురువారం మంత్రి విచ్చేసిన సందర్భంగా రైతులు ఆయన్ను కలిసి సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి సంబంధిత విద్యుత్ అధికారులతో మాట్లాడి రైతుల సమస్యను పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. దీంతో అధికారులు పరుగులు తీసి వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభాలను నిర్మించారు. ఆదివారం విద్యుత్ కనెక్షన్ కూడా అందజేశారు. రెండు మాసాలుగా జరగని పని ఒక్కరోజులో జరిగిపోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.